# విషం కురిసిన రాత్రి

యమ్. సుబ్బారావు

జానకి!

పాతికేళ్ళక్రితం వెల్ల వేసిన ఇలులా వెన్నెల వెలవెలబోతోంది. 'వెన్నెల కాదిది విషం' ఆ రోజుకి ఆరోసారనుకుంది జానకి.

గుళ్ళో భజంత్రీలు కరకరతోరంగా వినిపిస్తూంటే 'వెధవ గొడవ' అని విసుక్కుని ఎడమ చెవికి అరచేయి అడ్డుపెట్టుకుని అటుతిరిగి పడుకుంది

వెన్నెల్లో గుడి ఇసుక దిబ్బలా వుంది. దిబ్బపక్క గొయ్యిలా చిన్న బావి. బావి పక్కగా పుల్లట ఏడు కొని వదిలేసిన ఇసుకలా పొడుగైన పాక, పాక మీద ఎండిపోయిన తాటాకులా బ్రతుకుగడిపే జానకి గుళ్ళో పెళ్ళి జరుగుతోంది. దేవుడి పెళ్ళి. జానకికి ఊహ తెలిశాక ఇది పదహారో పెళ్ళి ఆ గుళ్ళో దేవుడికి కానీ తనకి.... ఇరవై ఆరేళ్ళొచ్చినా పెళ్ళిచూపులు కూడా జరగలేదింత వరకూ. తన వయసు వాళ్ళంతా సంసార సుఖాన్ని అనుభవించి పారేస్తే తానింకా దాన్ని కోరుకునే స్థితిలోనే వుంది. తండ్రి మాత్రం పూజారిగా ప్రతియేడూ స్వామివారి కళ్యాణం జరిపిస్తూనే వున్నాడు.

అవును. జానకి తండ్రి పూజారి మాత్రమేకాదు. ఊళ్ళోకూడా శుభ కార్యాలు జరిపిస్తాడు. తన దేవునికి పెళ్ళి చేస్తాడు. ఊళ్ళోవాళ్ళ శోభనాలకి తాంబూలం తెచ్చుకుంటాడు. జానకి విషయంలో తప్ప మిగతా విషయాలో ఆయన విధి నిర్వహణకు సాటిలేరు

"నిత్యం దేవుని దగ్గరేవున్నా అతన్నడిగి నాకు మొగుణ్ణి తేలేక పోతున్నాడు నాన్న" జానకి సన్నగా గొణుక్కుంది.

దేవుడు మనుషులపాలిట గబ్బా సింగ్

"జానకీ! మాధవరం నుండి దీక్షితులుగారొచ్చారు. అలా పందిట్లోకి వెళ్ళి కాస ఆయన కంటపడు" గుళ్ళోంచి ఇంటో వస్తూ నావిటో పడుకున్న జానకి చెవిన ఆ మాట పడేసి ఇంట్లోకి వెళ్ళి మళ్ళీ హడావిడిగా గుళ్ళోకి వెళ్ళి పోయిందామె జానకి తల్లి. గుట్టుగా సంసారం చేసే యిల్లాలు భర్తను సాధించుకుతిన్నా ఏ పనీ జరగదని తెలిసిన సామాన్య గృహిణి

"దీక్షితులు తప్ప నాకు మొగుడుగా మరొకడు దొరకడమ్మా .. అసలు నన్నెందుకు కన్నావ్" తల్లి వైపు జాలిగా చూసింది జానకి.

పెళ్ళంటే ఏమిటో అర్థం స్ఫురించిన రోజుల్లో మొదటిసారిగా చూసిన మావయ్య కూతురు పెళ్ళి తరువాత దేవుడి పెళ్ళి, ఆ తరువాత 'బంగారు పెళ్ళి ఎంత బాగున్నాయ్ చను ట్టు మంగళసూత్రాలు మావయ్య కూతురికి ఎంత అందాన్నిచ్చాయో పట్టుచీర కట్టగానే అమ్మవారికి ఎంత కళొచ్చిందో ...వేసే అడుగుల్లో కాలి మట్టెల చప్పుడు ఆపైన 'బంగారు'లో వచ్చిన మార్పు .. అబ్బ పెళ్ళి చేసుకుంటే ఇంత హాయి. అందం ఆనందం వుంటాయన్న మాట. ఇవే ప్రతిక్షణం జానకి ఆలోచనలు

'బంగారు ఒకసారొచ్చినప్పుడు మెడలోని మంగళసూత్రాలు బైటకు తీసి చూసుకుంటూ మళ్ళీ పైట లోపల దాచుకుంటూ ఉంటే కనీ కనిపించకుండా అగుపించే ఆసూత్రాలు జానకిని పిచ్చెక్కించేవి. అక్కడున్న అన్ని రోజులూ బంగారు చుట్టూ పిచ్చి దానిలా తిరిగింది. నాకూ పెళ్ళం వుందన్న గర్వంతో అప్పట్లో బంగారు చెప్పే మాటలు వింటే జానకికి మైకం కమ్మేది. 'పెళ్ళి కాకుండా చచ్చిపోనివ్వకు భగవాన్' అని కోరుకునేది జానకి. కావలసినవి మూడేమూడు పెళ్ళి. పెళ్ళి. పెళ్ళి

అమ్మ 'ఏం చేసాం దీక్షితులు చేసుకుంటాడేమో అడగండి' అని నాన్నకు సిఫార్సు చేసింది ఆయన ఏమని అడగలడు వచ్చిన ఆదాయం తింటానికే సరిపోదే. ఏం పెట్టి పెళ్ళి చేస్తామనేది ఆయన బాధ. ప్రత్యేకించి ఆదాయమంటూ తనకి వేరే ఏదీలేదు గుడికి వచ్చే భక్తులు చాలా తక్కువ శిథిలమయిన గుడిలో దేవుడుండడని భక్తుల నమ్మకం. అందుకే ఎవరోకాని రారా గుడికి. ఏడాదికి వెయ్యి రూపాయిలిచ్చిపోతాడు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్. అంతే. అది పెట్టుకు తినాల్సిందే. ఏడాదికొకసారి దేవుని పెళ్ళి ఖర్చులోనైనా ట్రస్టీబోర్డుకి తప్ప తనకేం మిగలదు. అసలు ఈ గుళ్ళో దేవునికి ఏటా పెళ్ళి చేసేది వాళ్ళు మిగుల్చుకోవడానికే. ఇక ఏముందని పెళ్ళి చెయ్యగలడు

**మొండిగా, ఏ కోరికా తీరక, పెళ్ళికాక ఇలా వుండే బదులు ఏదో ఒక తృప్తికరమైన మార్గం వెతుక్కోవాలి. అమ్మా నాన్న కూతుర్ని కన్నారుకాని అల్లుణ్ణి తేలేరు. నా మొగుణ్ణి నేనే వెతుక్కోవాలి. నా మెడలో పసుపుతాడు కట్టాలి. ఆ తృప్తిచాలు.**

భారం అంతా దేవునిపై వేసి మిన్నకున్నరాయన. భక్తుడు భగవంతునికి సర్వం సమర్పిస్తే భగవంతుడు భక్తునికిచ్చేవరం చేతకానితనం.

అక్కడికీఒకరిద్దరిచేత [illegible] దీక్షితుల్ని మూడో పెళ్ళికి ఒప్పించగా డాయన "అమ్మాయిని చూడాలిగా. రేపు దేవుని పెళ్ళికి వచ్చి చూసి చెబుతా"నన్నాడు దీక్షితులు. పెళ్ళి కాని ఆడది ప్రతివాడికీ లోకువే

అతనెలాంటి వాడైనా తన మెళ్ళో ఓ పసుపు డేసి తీసుకుపోతే భాగ్యమనుకుంది జానకి. మూడో పెళ్ళయితేనేం తనను తన మొగుడేం చేసుకున్నా తనకనవసరం. ఇంత కాలం ఏ కోరికా తీరక ఎలా గడిచిందో ఇకముందు కూడా అంతే అయినా ఫరవాలేదు. ఎటొచ్చీ పెళ్ళవుతుంది. అదేగా కావలసింది

"అమ్మగారూ."

కళ్ళువిప్పి ఇటుతిరిగింది జానకి. ఎదురుగా బంగారు

"ఎంతసేపైంది బంగారు వచ్చి" లేచి కూర్చుంటూ అడిగింది "ఇప్పుడే" నంటూ కబురాడింది జానకి

"ఏం ఇలా వచ్చావు బంగారూ."

"మీ దగ్గర ఐదు రూపాయిలుంటే ఇత్తారా. మళ్ళ మీది మీకిచ్చేత్తాను" ఆశగా అడిగింది బంగారు.

'ఎందుకే'

"ఎందుకేటండి. కట్టుకున్నోడు లాంటి ఎదవెనా అన్ని సరిగా సూసుకోకపోతే సరింటికి రాడు" అంటూ మొగుడు తాగటానికి ఐదు రూపాయలుంటే యిమ్మంది. బంగారు మొగుడు ఊసు చెప్పగానే జానకి బంగారుని కలయచూసింది. తృప్తిగా నిట్టూర్చింది బంగారు తనకు అప్పురాలే. కానీ ఇవ్వడానికి తన దగ్గర డబ్బెక్కడిది? తనదగ్గరే డబ్బుంటే ఏ సినిమాకో వెళ్ళేది. ఇదివరకూ ఎలావున్నా సినిమా చివర హీరో హీరోయిన్లకు పెళ్ళవుతుంది కాబట్టి


"ఇప్పుడు నా దగ్గర డబ్బుల్లేవే బంగారు. రేపురా వుంచేయిస్తాను."

"సర్లెండి ఇయ్యాల్టికి ఎక్కడైనా సర్దుతాను లేకపోతే నా ఒళ్ళు హూనమైపోద్ది" అని వెళ్ళిపోయింది బంగారు

బంగారు వెళ్ళగానే బావిదగ్గరకు వెళ్ళి నీళ్ళు తోడుకుని ముఖం కడుక్కుంది. ఇంట్లోకి వచ్చి తలదువ్వుకుంటూ గుళ్ళోకి చూసింది. గుళ్ళోకి

వచ్చిన జనం పాతిక మంది కూడా లేరు.

భజంత్రీలు ఆగడంతోనే దీక్షితులు చదువుతున్న మంత్రాలు విన పడుతున్నాయి. జానకి గుళ్ళోకి వెళ్ళింది దీక్షితులు ఊగిపోతూ మంత్రాలు వల్లెవేస్తున్నాడు. మధ్య మధ్య నోట్లోంచి ఉమ్మి తుంపరలు పడి స్వామివారు పావనం అవుతున్నారు. నలభై దాటుండొచ్చు దీక్షితులకి. నల్లగావున్నా మనిబాగు కాదని సరిపెట్టుకుంది జానకి. దీక్షితులి, అంత సేపు చూడలేక అటు వెపు చూసింది. ఆ మూల .. వాళ్ళి దర్నీ చూడగానే తల తిరిగినట్లైంది గబగబా ఇంట్లోకి వచ్చేసింది.



వాళ్ళిద్దరూ తనకు దగ్గర కావడానికి ప్రయత్నించారు.

"ఏమోయ్ గుళ్ళలోనూ, బస్సులోనూ హరేరామ హరేరామ రామ రామ హరేహరే అని ఒకవైపు హరే కృష్ణ హరేకృష్ణ, కృష్ణ కృష హరే హరే అని మరొకవైపు వ్రాస్తారెందుకోయ్" అని మిత్రుడడిగితే ఆ శ్ళ జోడబ్బాయ్" రాముడిలాంటి వాడైనా కృష్ణుడిగా మారడం కలియుగ ధర్మం అని చెప్పడానికి రా అంటూ చూసిన చూపులనుండి తప్పించుకోలేకపోయింది జానకి.

ఆ తరువాత అతను గుళ్ళోకి వచ్చినప్పుడలా జానకి మనసు గుళ్ళోకి వస్తుగుతీసేది మొండిగా, ఏ కోరికా తీరక పెళ్ళికాక ఇలా వుండి బదులు ఏదో ఒక తృప్తికరమైన మార్గం వెతుకోవాలి అమ్మా నాన్న కూతుర్ని కన్నారు కాని అల్లుణ్ణి తేలేరు 'నా మొగుణ్ణి నేనే వెతుక్కోవాలి నా మెడలో పసుపు తాడు కట్టాలి ఆ తృప్తితో చచ్చిపోవాలి అందుకే వాళ్ళతో పరిచయం పెంచుకుంది. కానీ ఒకసారి బంగారు అన్నమాట వాళ్ళతో స్నేహాన్ని తగ్గించి ది తానుండవలసిన స్థానాన్ని గుర్తించింది. అది కష్టమే ... అయినా ఆడదానిగా ఆ పద్ధిని దాటలేను కదా! అనుకుంది జానకి బంగారు ఎంత మంచిది తన త్రోవ తప్పే సమయంలో "తొందరపడకమ్మా! పెళ్ళికాని ఆడదానికి దృటం కడుపు రాకపోవడమే" అంటూ చేసిన హెచ్చరిక తన బ్రతుకికి అర్థం తెలిపింది తరువాత ఆ కళ్ళజోడబ్బాయ్ కనబడినప్పుడు పెళ్ళి చేసుకోమని అడిగింది. అందుకతను నవ్వి "ఆడదానికి పెళ్ళి మగవాడికి పెళ్ళాం అందాన్నిస్తాయి నాకిదివరకే పెళ్ళయిందన్నాడు. కేవలం నీ సుఖం కోరి స్నేహం చేస్తున్నానన్నాడు." అప్పట్నుంచి వారిని కలియడం మానేసింది తాను పొరపాటున కూడా తప్పుదారి పట్టనందుకు సంతోషించింది

"దేవుడా నన్ను రక్షించు ... దీక్షితులు పెళ్ళి చేసుకునేటట్టు చెయ్యమని మొక్కుకుంది జానకి.

బంగారు :

'సీ. ఎదవ బతుకు. పెళ్ళయితే ఏటుంది చనం సుఖంనేదు, శాంతి నేదు. మొగుడొచ్చి మరీ కట్టాలు పాల్జేశాడు. ఉన్న పేదరికం సాల్దేటి ఇంకా బీదెపోవాలా మనాటోల్లు. కటుకున్న మొగుడికి బుద్దినేదు నేక

పోతే సంపాయించేదేవీ లేకపోయినా పీకలమొయ్యా తాగుతాడు. పైగా పేకాటొకటి. అడు తెచ్చుకున్న డబ్బుతోటాడేటి సేసుకున్నా తను సంపాయించేదాంట్లో అడిక్కా_స్తకూ డెట్టకపోదు. ఆడి తాగుడుక్కూ_డా నేనే ఇయ్యాలంటే ఎలాగ? నరక౦ అంటే ఎక్కడో నేదు. పెల్లిసేసుకుంటే దానంతటదే ఒస్తది.

అదేం సిత్రవోగాని ఆ జానకమ్మ. గోరు పెలి పెల్లని తెగ్గింజుకుంటది ఆయమ్మకి పెలిగాదు. ఎలాగవుద్ది? ఆలల్లో కట్నాలుండాల, సెయ్యడానికుండాల, అయ్యుండాల ఇయ్యుండాల. ఆ యమ్మని తలుసుకుంటే ముద్దదిగదు. అయినా ఆ వయసలాటిది. నాకు పెలయింది గాని నేకపోతే నేనూ అంతే. ఆడదానికైతే మాత్రం పెలిమీద బెముండదేటి?

హుఁ! 'మూ(డో లైంది ఆ మొగోడు బైటికెల్లి. అడు పనేసినా డబ్బు ఇంటికి తెస్తాడని ఆశ లేదు కనీసం కూటికైనా ఇంటికి రాడు. మందు కడుపులో పడకపోతే నా దగ్గరికి డబ్బులకోసవని ఒస్తాడు ఇయ్యకపోతే తిడతాడు. ఒకోసారి సెయ్యి జేసుకుంటాడు. నిన్న మట్టికి నిన్న డబ్బులియ్యలేదని ఇంట్లో బియ్యం పట్టుకుపోయి అమ్మేసి తాగేసాడు. ఇయ్యాలుదయం ఒల్లు చితక బొడిచేసాడు డబ్బులియ్యలేదని. ఇందాక జానకమ్మగోరి దగ్గరికెల్తే పాపం డబ్బులేవని సెప్పడానికెంత ఇదైపోయింది. ఒకింటిదాన్ని కాలే

రెస్ట్

దని ఆవిడకి బెంగ. మొగుడింటికి రాలేదని నాకు బెంగ వుంటె రేపిస్తానంది. రేపైనా ఇస్తె బావుణ్ణు.

ఆడదానికి పెళ్ళికాకపోయినా పెల్లయిన ఆడది దెబ్బలు తిన్నా మగోలకి ఎదవ బుద్ధుండబట్టే గదా! ఏ గొడవెలాగున్నా ఆ దీచ్చితులు జానకమ్మని పెల్లిసేసుకుంటే బాగున్ను. ఆ యమ్మ మనసు తీర్తాది నాకు డబ్బులిస్తాది. ఎదవ సచ్చినోడి కడుపు మందుతో నిండుతాది. రేపాయమ్మ డబ్బులియ్యక పోయినా తనకా బాధలేదు. తను సావుకైనా సిద్ధవే. డబ్బుకోసం ఇయ్యాల తిట్టేడు, తన్నేడు. రేపు రంకుతనం సెయ్యమనని గేరెంటీ యేటి? సీ....సీ .. ఆ పని మాత్రం సెయ్యను. సూసిన పెతిదాన్ని పెల్లాం అనుకుంటోడు మగోడు. కాని పెతి మొగోడు ఆడదానికి మొగుడవగల్డా. అందుకే ఆడుకాదంటే తను సచ్చిపోది కాని ఆడికి తలొగ్గదు.


ఇయ్యాల కూడా కడుపులో కూడు పడ్డేదు. జొరంగుందనిగాని పన్లోకెల్లనా? రేపు జానకమ్మ డబ్బులిస్తె మనసు తిమితపడతాది.

* * *

ఎండిపోయిన చెరువులా వుంది జానకి. చచ్చిపోయేముందు చూసే వెర్రి చూపులావుంది జానకి. చచ్చిపోయినట్లుగా వుంది జానకి.

నిన్న పెళ్ళయ్యాక దీక్షితులతో బాటు ఊరెళ్ళిన పూజారిగారు దీపాలు పెట్టే వేళకు ఇంటికివచ్చాడు శవం నడిచొచ్చినట్లొచ్చారు. వస్తానే

-ఎన్. రవిశంకర్




"అమ్మాయి యింట్లో వుందా" అన్నారు.

"గదిలో పడుకుంది. ఏమన్నాడు దీక్షితులు?" భర్తకు మంచినీళ్ళం దిస్తూ అడిగింది జానకి తల్లి

గాలి విసిరినా బాలు కూలిపోయే ఇసుక మేడలా వున్నారు పూజారిగారు. "దీక్షితులు పెళ్ళిచేసుకోనన్నాడు" ఎలాగో అన్నారామాట.

ఆ మాట చెవినపడే ఎండిపోయిన చెరువులా అయిపోయింది జానకి.

"ఏం" అంది గదిలోకి భయంగా చూస్తూ తల్లి.

"ఏం చెప్పమంటావ్. ఆ దీక్షితులు నానా మాటలూ అన్నాడు. మీ అమ్మాయికి ఇరవై మూడేళ్ళన్నారు. కాని పాతికేళ్ళు పైబడ్డదానిలా వుంది. ఇంతకాలం కన్నెపిల్లగానే వుందని నేననుకోను. ఎవరితోనో తిరిగిందని విన్నాను. పైగా కన్నెపిల్లలో వుండాల్సిన కళా కాంతీలేవు. పిల్లల్ని కన్నదానిలా ఎండిపోయుంద"న్నాడు ఇంకా ఏవేవో అన్నాడు. నేనవేవీ వినలేను ఇక ప్రాధేయపడలేక వచ్చేశాను.

"గత్యంతరంలేక అతన్నడిగామని ఇన్ని మాటలన్నాడా. మీరు విని వూరుకున్నారా!"

"ఏం చెయ్యను. విని ఊరుకోలేనివాడ్నయితే ఈపాటికి ఎప్పుడో దాని పెళ్ళయ్యేది."

"మరయితే ఏం చేదాం."

"ఏం చేసాం. పుట్టినందుకు అది కన్నందుకు మనం తలబాదుకు బావాల్సిందే. ఆ దీక్షితులు ఈమాటలు ఒక్కడ్నీ ఉండగా అనలేదు. నలుగురిమధ్యా అన్నాడు. ఇంకెవరొస్తారు దాన్ని చేసుకోవడానికి?"

* * *

"నాన్నా నేను, బంగారు సినిమా కెళతాం. ఒక ఐదురూపాయలు ఇయ్యి నాన్నా" చంటిపిల్ల అడిగినట్లున్నాయి జానకి మాటలు.

"నిన్న పెళ్ళికి వచ్చిన సంభావనలో మిగిలినవే ఈ ఐదు. పోనీలె పట్టుకెళ్ళు. అన్నట్లు నిన్న అమ్మవారికి కట్టిన చీర ఉంచేసుకోమన్నారు. అది కట్టుకెళ్ళు" చేతిలో ఐదు రూపాయిలు పెడుతూ ఆప్యాయంగా అన్నాడు తండ్రి

"అలాగే నాన్నా"

త్వరగా తయారయి బంగారు యింటికి వెళ్ళింది జానకి 'నాతో రా



తథాస్తు

అప్పారావు గుర్రానికో ప్రత్యేకతుంది. ఆ గుర్రం 'దేవుడు' అనగానే పరిగెడుతుంది. 'తథాస్తు' అనగానే ఆగిపోతుంది.

ఓసారి 'దేవుడు' అనగానే పరిగెత్తి ఓ పెద్ద లోయ దగ్గర కొచ్చింది. అప్పారావు హడిలిపోయి 'తథాస్తు' అన్నాడు. గుర్రం ఆగింది

"హమ్మయ్య! ఈమాట గురు రాకపోతే ఇంకేమైన వుందా? దేవుడు రక్షించాడు" అని సంబరపడ్డాడు.

అంతే! 'దేవుడు' అన్న మాట వినపడగానే ఆ గుర్రం అమాంతం లోయలోకి దూకేసింది

-వాలి లక్ష్మణరావు హన్మకొండ)

బంగారు నీకు డబ్బులిస్తాను' అంది జానకి.

ఇద్దరూ బయల్దేరారు.

వెన్నెలకురుస్తోంది. "అమ్మగారూ వెన్నెల బాగుంది కదూ" బంగారు అంది.

"కాసేపట్లో విషం అవ్వొచ్చు కదే" నవ్వుతూ భుజంమీద చెయ్యేసింది జానకి. తుళ్ళిపడింది బంగారు.

ఇద్దరూ చెరువు గట్టుకెళ్ళారు. దీక్షితులు నన్ను పెళ్ళిచేసుకోనన్నాడంటూ జరిగినదంతా చెప్పింది. "నాకో సాయం చేసిపెట్టు బంగారూ. ఈ ఐదురూపాయిలుంచు" అని చేతిలో ఐదురూపాయిలు పెట్టింది.

ఇప్పుడెందుకులెండి. మీరు నాకన్నా ఇబ్బందుల్లో వున్నారు. ఇప్పుడొద్దులెండి,"

"తీసుకో బంగారు. నా మాట కాదనకు. నా కోరిక తీర్చు."

జానకి కోరిక విని స్థాణువైపోయింది బంగారు క్షణం సేపు నోట మాట రాలేదు ఏమనాలో అర్థమవలేదు.

"ఇది చాలా తప్పమ్మాయిగారూ"

"ఇందులో తప్పేముంది బంగారు కాని పని చెయ్యమనడం లేదు నీ మెడలో తాళి కాసేపు నా మెడలో వుండనివ్వమంటు న్నాను. కొందరు తాళి అమ్ముకోగా లేనిది నువ్వీ పనిచేస్తే తప్పా? తాళి అమ్మినా, అద్దెకిచ్చినా అది నీ మొగుడి కోసమేకదే. తప్పెలా అవుతుంది. నీ మంగళసూత్రాన్ని నాకు కాసేపు అద్దెకిచ్చాననుకో"

'నాక్కావలసింది డబ్బు. ఆ యమ్మకి కావలసింది తాళిబొట్టు మళ్లీ నాది నాకిచ్చేస్తదిగా భయ మెందుకు. నూసేవోడుకూడా ఎవుడూ లేడిక్కడ. తప్పదు. ఇలా సెయ్యక పోతే. ఈతాళిబొట్టుతో నేనే బావిలో కలిసిపోవాల్సొస్తది ఆడికి డబ్బు లియ్యకపోతే నన్ను బతకనిస్తాడేటి! శరీరం అమ్ముకోవడం ఎదవ పని గానీ ఇది ఎదవ పని కాదుగా'!

"సరే అమ్మాయిగారూ."

జానకి కళ్ళలో పెళ్ళికూతురు కళొచ్చింది చెరువుగట్టున తలొం చకు కూర్చుంది జానకి.

చంద్రుడు మూర్ఛపోయా శవం లేచి నుంచొచ్చినట్టుగా గాలి చల్లగా వుంది. చెరువులో నీళ్ళు పిశాచి పాట పాడుకుంటున్నాయి

బంగారు తన మెడలో మంగళ సూత్రం తీసింది. జానకి మెడలో నెమ్మదిగా వేసింది బంగారు కళ్ళలో నీళ్ళు అక్షతలై జానకి తల మీద పడ్డాయి.

జానకి బంగారుని గట్టిగా కావ లించుకుంది. వెర్రినవ్వుతో బాటు ఏడుపు కూడా ముంచుకొచ్చింది.

చాలాసేపు కూర్చున్నారు చెరువు గట్టున. ఎన్నో మాట్లాడుకున్నారు. సినిమా వదిలే టైంకి ఇంటి దారి పట్టేరు. బంగారు తన మంగళ సూత్రం తీసుకొని మెడలో వేసు కుంది చేతిలో ఐదురూపాయిల కాగితంతో మొగుణ్ణి వెతుక్కుంటూ బయలేరింది

జానకి ఇంటికి నడిచింది. తలీ తండ్రి నిద్రపోతున్నారు. గుళ్ళో దేవుడు అలాగే వున్నాడు. బావి దగ్గరకు నడిచింది తనలో తానే నవ్వుకొంది. 'నాకు పెళ్లైందికదూ' అనుకుంది

మరుక్షణం బావిలో శబ్దమైంది భగవంతుడు గతుక్కుమని బావు రేక వేసి మెల్లో ...న్నాడు.

*

# ఆంధ్రభూమి

సచిత్రవారపత్రిక

జన్మదిన ప్రత్యేక సంచిక

# రు. 2,000 కథల పోటీ

ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక మరో కొద్దివారాల్లో రెండో 'పుట్టినరోజు' జరుపుకోబోతున్నది. ఈ శుభ సందర్భాన్ని పురస్క రించుకుని రచయిత(త్రు)లకు ఆకర్షణీయమైన బహుమతులను ఇవ్వదలిచాము.

## కథలపోటీ జన్మదిన సంచికకు ప్రత్యేక ఆకర్షణ!

| | |
|---|---|
| మొదటి బహుమతి | రు. 1,000 |
| రెండవ బహుమతి | రు. 500 |
| మూడవ బహుమతి | రు. 200 |

## మరో మూడు కన్సొలేషన్ బహుమతులు రు. 300

ఈ కథలన్నీ ప్రత్యేక సంచికలో ప్రచురిస్తాము.

పోటీకి నియమ నిబంధనలు :

1. కథ పన్నెండు అరఠావులకు మించరాదు (అరఠావు అంటే ఎక్సర్ సైజ్ నోట్‌బుక్ సైజుకి రెట్టింపు).
2. కాగితానికి ఒకవైపునే సిరాతో రాయాలి.
3. ఇతివృత్తం తెలుగువారి జీవితానికి సంబంధించినదై వుండాలి.
4. సొంత రచనలేగాని అనువాదాలు. అనుసరణలు పనికిరావు.
5. బహుమతి పొందని కథల్లో నచ్చిన వాటిని ఆంధ్రభూమి సచిత్ర వారపత్రికలో ప్రచురించే హక్కు మాకు వుంటుంది.
6. ప్రచురణకి స్వీకరించని కథలను తిప్పి పంపాలంటే, స్టాంపులు అంటించిన విరునామాగల కవరు తప్పనిసరిగా జత చేయాలి.
7. ఈ పోటీకి పంపించే రచనమీద, కవరుమీద 'కథల పోటీకి' అని స్పష్టంగా రాయాలి.
8. కథల ఎన్నిక విషయంలో తుది నిర్ణయం ఎడిటర్‌దే. దీనిపై వుత్తరప్రత్యుత్తరాలకు అవకాశంలేదు.
9. ప్రతి కథ వివరా రచన తమ సొంతమేనని, ప్రసారంకాని, ప్రచురణకాని కాలేదని హామీ వుండాలి.
10. కథ బాగున్నా పై నిబంధనలు పాటించకపోతే రచనలు పోటీకి పరిశీలించబడవు.
11. రచనలు—ఎడిటర్. ఆంధ్రభూమి సచిత్ర వార పత్రిక, 36–సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003. అనే విరునామాకి పంపాలి.

## పోటీ కథలు చేరవలసిన ఆఖరు తేదీ 19-6-79

## జన్మదిన ప్రత్యేక సంచిక వివరాలు అతి త్వరలో!